క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తే చర్యలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై

నస్పూర్: పట్టణ పరిధిలో ఎవరైనా గంజాయి విక్రయించినా, సరఫరా చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్ హెచ్చరించారు. పట్టణ పరిధిలో గంజాయి సేవించి పట్టుబడిన యువకులకు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో గురుకుల కళాశాలలో వైష్ణవి విద్యుత్‌షాక్ గురికావటానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకుల నిర్లక్ష్యంతోనే సంఘటన జరిగిందని ఆరోపించారు.

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సులభ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10న ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సులబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ.. సులభ్ కార్మికులు అనారోగ్య సమస్యలతో చనిపోతున్నా, ఎవరూ పట్టించుకున్న నాథుడులేరన్నారు. సులభ్ కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా ప్రమాద బీమా కల్పించాలని, బోనస్ కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, అప్పారావు, నర్సయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఆదివారం బాధితులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందించారు.

కాల్వ సుజాతకు సన్మానం



కాల్వ సుజాతను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతగుప్తాను నస్పూర్ మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సీసీసీ కార్నర్‌లోని ఆదిపరాశక్తి అమ్మవారి బోనాల జాతరకు ఆదివారం ఆమె హాజరయ్యారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద వైశ్య సంఘం నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ వ్యవస్థాపక ఏరియా అధ్యక్షుడు కిషన్‌కుమార్, అధ్యక్షులు దత్తత్రేయ, సెక్రెటరీ వివేక్, కోశాధికారి అశోక్, నాయకులు వీరభద్రస్వామి, శివప్రసాద్, భూమయ్య, నాగయ్య, అశోక్‌లు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

కాసిపేట: ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవా న్ని అన్నివర్గాల ప్రజాలు విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. దేవాపూర్‌లో కులసంఘాలు, గ్రామస్తులు, యువకులు, ఉ ద్యోగస్తులందరి సమక్షంలో ఆదివారం సమావేశమై ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసీ గూడేలలో ఆగష్టు 9న ఉదయం 8గంట లకు ఆకుపచ్చ జెండాలు ఎగురవేయాలని తీర్మానించినట్లు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి దేవా పూర్, కొండపూర్ యాప, మండల కేంద్రాల్లో నిర్వహించే ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరా రు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా మడావి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం మహేశ్, కోశాధికారిగా కుర్సింగ తిరుపతి, ఉపాధ్యక్షులుగా మడావి గోపాల్, మడావి మధుకర్, సంద్ర భూమన్న, కార్యదర్శులు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కంపుకొడుతోంది..!



ఇందిరానగర్ కాలనీలో డ్రెయినేజీలో నిలిచిన నీరు



నలగొండ పోచమ్మవాడలో నిర్మించిన డ్రెయినేజీ

- డ్రెయినేజీల్లో నిలుస్తున్న మురుగునీరు
- సమస్య పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోవట్లే...
- ఇందిరానగర్ కాలనీవాసుల ఆరోపణ
- నిధుల దుర్వినియోగంపై.. విచారణ జరిపించాలని డిమాండ్

చెన్నూర్: మున్సిపాలిటీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. రూ.లక్షల నిధులలో నిర్మించిన డ్రెయినేజీలతో లాభం లేకుండా పోయిందని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. మురికి కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో నీరు నిలిచి కంపు కొడుతున్నాయి. ఎస్సీ కాలనీలలో డ్రెయినేజీల నిర్మాణానికి గతేడాది ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి రూ.92లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులలో చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 11, 12, 7 వార్డులతో పాటు రెండు వార్డులలో డ్రెయినేజీలు, రోడ్లను కేటాయించారు. దీంతో వార్డులలో డ్రెయినేజీలు నిర్మించి చేతులు దులుపేసుకున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. డ్రెయినేజీల నిర్మాణంలో ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షణ లోపంతో లక్షలాది నిధులు దుర్వినియోగం అయ్యాయని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీలు నిర్మించినా మురికి నీరు సక్రమంగా వెళ్లడంలేదని, నిలిచి ఉంటుందని ఎన్నిమార్లు ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఇందిరానగర్ వాసులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీలో రూ.92లక్షల నిధులతో నిర్మించిన డ్రెయినేజీలను జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సక్రమంగా చేపట్టని పనులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులు సక్రమంగా నిర్వహించలే..



డ్రెయినేజీలు సక్రమంగా నిర్వహించలేదు. మురికి కాలువ నుంచి చుక్క వెళ్లడం లేదు. మురికి నీరు డ్రెయినేజీలలోనే నిలిచిపోవడంతో కాలనీ కంపు కొడుతుంది. అధికారుల నిర్లక్ష్యంతో లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయి.

– మేకల వెంకటేశ్, నలగొండ పోచమ్మ వాడ

పనులపై విచారణ జరిపించాలి



నామమాత్రంగా నిర్మించిన డ్రెయినేజీ పనుల పై జిల్లా అధికారులు విచారణ జరపాలి. పనులు సక్రమంగా నిర్వహించని కాంట్రాక్టర్, సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– ప్రవీణ్, చెన్నూర్

వర్గీకరణ పోరులో అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు
- మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం



కాసిపేట: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాసిపేట/చెన్నూర్/పాతమంచిర్యాల/జన్నారం: ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులైన వీరుల త్యాగాలు మరువలేనివని, సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ అనుకూల తీర్పు వెనుక మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం ఉందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పలు మండల కేంద్రాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు దేశంలో న్యాయవ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచిందన్నారు. 30ఏళ్లుగా వర్గీకరణ లేక మాదిగ ఉపకులాలు చాలా వెనకబడిపోయాయని పేర్కొన్నారు. చెన్నూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరీ సమయ్య, నాయకులు గొడిశెల దశరథం, జిల్లపెల్లి వెంకటేశం, గడ్డం సత్యం, మోతే పోచం, రాజారాం, కుంటాల శంకర్, చెన్నూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంత్రి మల్లేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి చకినారపు మల్లేశ్, వేముల రమేశ్, రాసపాక మల్లేశ్, జన్నారంలో రిటైర్డ్ తహసీల్దార్ శ్రీపెల్లి లక్ష్మయ్య, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీపెల్లి జగన్మోహన్, కాసిపేటలో సీనియర్ నాయకుడు దాసరి రాంచందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్‌మాదిగా తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద...



పాతమంచిర్యాల: మాట్లాడుతున్న నాయకులు

సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం

- ఇద్దరిపై కేసు నమోదు

నెన్నెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన నెన్నెల యువకులు పల్లా మహేశ్, ముస్కె రామన్నపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ద్వందార్థాలు వచ్చేలా పాటలు జోడించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారని తెలిపారు. వీడియోలో అప్‌లోడ్ కావడంతో కాంగ్రెస్ కార్యకర్త మిట్ట కిరణ్ ఫిర్యాదు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నెన్నెల: మండలంలోని కోనంపేటకు చెందిన తైదిల రమేశ్ గురువారం తన మనుమరాలు కీర్తనతో బెల్లంపల్లి దవాఖానకు వెళ్లి, బైక్‌పై తిరిగి ఇంటికొస్తుండగా కుర్మగుడెం వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్‌కు డీ కొట్టాడు. ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా మరో బైక్ వ్యక్తి పారి పోయాడు. ఈ క్రమంలో రమేశ్ భార్య లీన ఆదివా రం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ వివరించారు.

నేటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులలో ఈ నెల 5నుంచి 9వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కమిషనర్ గంగాధర్ తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, కాలనీల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రైస్తవుల కొవ్వొత్తుల ర్యాలీ

బెల్లంపల్లి: ప్రకృతి వైపరీత్యంతో కేరళ రాష్ట్రంలో సర్వం కోల్పోయిన ఆ రాష్ట్ర ప్రజల క్షేమాన్ని కాంక్షిస్తూ ఆదివారం బెల్లంపల్లిలో క్రైస్తవులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ అశోక్, కేతలిక్ చర్చి ఫాదర్ రెవరెండ్ కురియన్‌ల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ జరిపారు. పురవీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి
- క్యాతనపల్లిలో రూ.2.33కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



గద్దెరాగిడిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రామకృష్ణాపూర్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి అనేది కుంటుపడిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.33కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణపు పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్ర ఖజానా మొత్తం ఖాళీ కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని గాడిలోకి తెచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజల నుంచి చాలా విన్నపాలు వస్తున్నాయని, అయితే ఒకొక్కటిగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతామన్నారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తా ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా గాంధారి వనంలో ఫ్రెండ్‌షిప్ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ స్కూల్‌ను ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రాజు, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అశ్విని

చెన్నూర్: పట్టణంలోని శార్వాణి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న టి.అశ్విని మంచిర్యాలలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 7నుంచి మెదక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో అశ్విని పాల్గొంటుందని తెలిపారు.

‘లచ్చన్న మృతి తీరని లోటు’

శ్రీరాంపూర్: మున్నూరు కాపు సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు దాసరి లచ్చన్న మృతి కులానికి తీరని లోటని మున్నూరు కాపు కుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, యూత్ అధ్యక్షులు శ్రీపతి సురేశ్, పీఆర్‌వో బీ. రాజేశంలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపోటుతో ఆయన మృతి చెందడం భాదాకరమన్నారు. మున్నూరు కాపు కుల సంఘం బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు.

హామీల అమలులో విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



మాట్లాడుతున్న రఘునాథ్

దండేపల్లి: ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పూర్తి స్థాయిలో హామీలు అమలు చేయడంలో విఫలం అయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆరోపించారు. దండేపల్లిలో ఆదివారం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు నెలకు రూ.2500, నిరుద్యోగులకు రూ.4వేలు, రైతు భరోసా వంటి పథకాల అమలు ఊసేలేదన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రశ్నిస్తే, తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. ప్రజా సమస్యలపై, హామీలపై ప్రజల పక్షాన పోరాడుతాం అని చెప్పారు. సమావేశంలో మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, నర్సింహులు, గురువయ్య, నరేష్, రవిగౌడ్, సురేందర్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

‘నిధులు మళ్లించి డ్రెయినేజీలు నిర్మాణం’

భీమారం: మండలంలోని గ్రామపంచాయతీల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రంథాలయాలకు కేటాయించిన నిధులను, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డ్రెయినేజీలకు మళ్లించిందని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గ్రామాల్లో విద్యార్థులు, నిరుద్యోగుల విజ్ఞానం కోసం 10గ్రంథాలయాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆ నిధులను మళ్లించి, మురుగు కాలువలకు కేటాయించడం ఎంత వరకు న్యాయమన్నారు.

సీసీ రోడ్డుపై వరద ప్రవాహం..!



భీమారం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ నుంచి ఎస్సీకాలనీకి వెళ్లేందుకు నిర్మించిన సీసీ రోడ్డు వర్షాకాలం సమయంలో వాగులా మారుతోంది. రోడ్డు పై నుంచి రాకపోకలు కొనసాగించేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 400మీటర్లు రోడ్డుకి ఇరువైపులా గతంలో నిర్మించిన డ్రెయినేజీలు శిథిలం కావడంతో, వరద నీళ్లు డ్రెయినేజీల్లోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రోడ్డుపై నుంచే ప్రవహిస్తున్నాయి. ఈ విషయంలో చర్యలు తీసుకొని రోడ్డుకు రెండువైపులా డ్రెయినేజీలు నిర్మించాలని పది సంవత్సరాల నుంచి ప్రభుత్వ అధికారులతో పాటు పాలకులకు వినతిపత్రాలు అందజేసినా, ఏమాత్రం ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, వరద నీళ్లు దారి మళ్లించి డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

‘భూ కబ్జాలకు పాల్పడలేదు’



మాట్లాడుతున్న భాస్కర్ బాల్నే

పాతమంచిర్యాల: జిల్లాలో మాజీ సైనికులు ఎలాంటి భూ కబ్జాలకు పాల్పడలేదని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాల్నే అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్గిల్‌లో పనిచేసిన మాజీ సైనికులు జిల్లాలో భూ కబ్జాలకు పాల్పడ్డారని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. మాజీ సైనికులు భూ కబ్జాలకు పాల్పడ్డారని తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా బీజేపీ నాయకులు గత నెల 10వ తేదీన నిర్వహించిన పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మాజీ సైనికులు ఎలాంటి కబ్జాలు చేయలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ మాజీ సైనికులపై వ్యాఖ్యలు చేయలేదన్నారు. దేశం కోసం పోరాడిన సైనికులకు అండగా ఉండాల్సిన పార్టీల నాయకులు, తమను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా అన్ని రాజకీయ పార్టీలు చూడాలని పార్టీలకు విజ్ఞప్తి చేశారు.



ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే

రామకృష్ణాపూర్: ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారి ఖిల్లాలో ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు ఆదివారం ఒకచోట చేరి ఫ్రెండ్ షిప్ డేను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మందమర్రి పట్టణానికి చెందిన పలువురు స్నేహితులు తమ 40ఏళ్ల ఫ్రెండ్ షిప్‌ను ఉత్సాహంగా జరుపుకున్నారు.

సంక్షిప్త వార్తలు

‘ప్రజల రక్షణ మా బాధ్యత’

జన్నారం: ప్రజల రక్షణ మా బాధ్యత అని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరిస్తామని ఎస్సై రాజవర్ధన్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు నైట్ హాల్ట్ కార్యక్రమం చేశారు. గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలతో సమావేశమయ్యారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

కార్యవర్గాలు ఎన్నిక

నస్పూర్: సీపీఐ మండల నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో మండల కార్యదర్శిగా జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా లింగం రవి, మొగిళి లక్ష్మణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అఫ్రోజ్‌ఖాన్, కోశాధికారిగా రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నారు.

జైపూర్: మండల కేంద్రంలో ఆదివారం హెచ్‌ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో హెచ్‌ఎంఎస్ యూనియన్ ఎస్టీపీపీ ఉపాధ్యక్షుడిగా టి.సాయికృష్ణ, కార్యదర్శి మునుమండ్ల రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అజార్, చిప్పకుర్తి తిరుమలేశ్‌లను ఎన్నుకున్నట్లుగా హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ ప్రధానకార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు సంపత్ తెలిపారు.

ఆటో యూనియన్ సమావేశం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఆదివారం ఆటో యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని తీర్మానం చేశారు. ఈ నెలలో రాష్ట్ర రౌండ్‌టేబుల్ సమావేశం జరుపనున్నట్లు తెలిపారు.

సీపీఐ పట్టణ నిర్మాణ సభ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ పార్టీ పట్టణ నిర్మాణ మహాసభ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరై పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ 1925డిసెంబర్ 26న ఆవిర్భవించిందని నాటి నుంచి నేటి వరకు పార్టీ నిర్వహించిన ఉద్యమాలు, సాధించిన విజయాలపై ప్రసంగించారు. అనంతరం నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా ఖలీందర్ అలీఖాన్, కార్యదర్శిగా చాడా మహేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా కుంచాల శంకరయ్య, బియ్యాల రాజేశం, కనకలక్ష్మిలను ఎన్నుకున్నారు.